క్లుప్తంగా

శాకాంబరీగా గాయత్రీమాత



శాకాంబరీ అలంకరణలో అమ్మవారు

పాలకొండ: పట్టణంలోని గాయత్రీ మాత ఆలయంలో వారాహిగుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదవ రోజు ఆదివారం గాయత్రీమాత శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి చిట్టిబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

సీతంపేట: సీతంపేటలో నిర్మాణంలో ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.భాస్కరరావు డిమాండ్ చేశారు. ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులు లేక రోగులు బయట కొనుగోలు చేస్తున్నారన్నారు. మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నా పట్టించుకునేవారు లేరన్నారు. సీతంపేటలో జనరిక్ మందుల షాపును అందుబాటులోకి తీసుకురావాలని, ప్రైవేటు మెడికల్ షాపుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

నేడు సహారా బాధితుల ధర్నా..

గరుగుబిల్లి: సహారా ఖాతాదారుల డిపాజిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు ఖాతాదారులతో కలిసి ర్యాలీ నిర్వహించనున్నట్లు సహారా ఏజెంట్లు జి.సర్వేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎంఎస్ నాయుడు, తదితరులు ఆదివారం తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. 2012 నుంచి చెల్లింపులు చేయకుండా నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని, ఈ కారణంగా అటు ఖాతాదారులు, ఇటు ఏజెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాతాదారలకు చెల్లింపులు చేసి బాధితులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ధర్నాలో సహారా బాధితులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పాలకొండ-వీరఘట్టం రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రత నిబంధలపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

రక్షణ గోడ నిర్మాణం



వంతెన వద్ద తాత్కాలిక రక్షణ గోడ నిర్మాణ పనులు

పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం వయా పార్వతీపురం, రాయిగడ అంతర్‌రాష్ట్ర రహదారిలో రాజుపేట కూడలి వద్ద ఉన్న మినీ వంతెనను ఇటీవల లారీ ఢీకొట్టడంతో వెంతెన రక్షణ గోడ కూలిపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. దీనిపై డీఎస్పీ జీవీ కృష్ణారావు స్పందించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసు, ఆర్‌అండ్‌బీ అధికారుల చొరవతో తాత్కాళిక రక్షణ గోడ నిర్మించారు. త్వరలో శాశ్వత చర్యలు చేపడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ఏపీజీవీబీ కాలనీలో చింత విమలారాణికి చెందిన శ్లాబు ఇల్లు పైకప్పు కూలిపోయింది. పక్కనే ఉన్న టి.పకీరునాయుడుకు చెందిన రేకుల ఇంటిపై పడటంతో ఇల్లు ధ్వంసం అయింది. రేకుల శబ్దానికి ఇంట్లోని వారంతా భయంతో పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు సర్పంచ్ గౌరీశంకరరావు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మోతాదుకు మించితే ముప్పే..

- భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వినియోగం మేలు
- అధిక మోతాదులో వేస్తే పంట దిగుబడిపై ప్రభావం
- సమతుల్యత పాటించాలంటున్న వ్యవసాయశాఖ సిబ్బంది



వరినాట్లు వేస్తున్న రైతులు

గరుగుబిల్లి: కొద్దిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ వరినాట్లు జోరందుకున్నాయి. వరినాట్లు వేసే పనిలో రైతులు, రైతు కూలీలు బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగం, సాగు యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవడం వల్ల సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని అంటున్నారు. ఎరువుల మోతాదు మించితే భూమి నిస్సారంగా మారడంతో పాటు దిగుబడులపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. నత్రజని, పొటాష్, భాస్వరం, జింక్ సల్ఫేట్ తదితర ఎరువులను ఎప్పుడు వేసుకోవాలి, ఎంత మోతాదులో వేసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో గరుగుబిల్లి, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో సుమారు 82 వేల ఎకరాల పంట భూములు ఉండగా.. అందులో 62,400 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు.

నత్రజని: నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలో లేదా యూరియా రూపంలో లభిస్తుంది. పంట ఎదుగుదలకు, పచ్చగా ఉండేందుకు నత్రజని దోహదపడుతుంది. దీని మూడు భాగాలుగా వేసుకోవాల్సి ఉంటుంది. మొదటి భాగాన్ని దమ్ములో 20 కిలోలు, రెండో భాగాన్ని పిలకలు వేసే దశలో 20 కిలోలు, మూడో భాగాన్ని అంకురం దశలో 20 కిలోలు చొప్పున వేసుకోవాలి.

భాస్వరం: మొక్కల వేర్లు బలంగా ఉండేందుకు దమ్ము సమయంలో భాస్వరాన్ని వాడతారు. లేనిపక్షంలో నాట్లువేసిన వారం రోజుల్లోపు వేయాలి. భాస్వరం అందించే క్రమంలో దమ్ములో మూడు బస్తాల సింగిల్ సూపర్ పాస్ఫేట్ రూపంలో గాని లేదా 50 కిలోల డీఏపీనిగాని వేయాలి. ఇలా వేసిన తరుణంలో పొటాష్‌ను దమ్ములో 20 కిలోలు వేస్తే సరిపోతుంది.

కురుపాం నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాలలో)
గరుగుబిల్లి	14,500
కురుపాం	12,200
గుమ్మలక్ష్మీపురం	8,700
కొమరాడ	12,400
జియ్యమ్మవలస	15,600

పొటాష్: పొటాష్ వల్ల ఆకులు గరుకుతనం కలిగివుండడమే కాకుండా గింజ గట్టిపడేందుకు దోహదపడుతుంది. వరికి చీడపీడల బెడద తగ్గుతుంది. పొటాష్‌ను దమ్ములో 25 కిలోలు, అంకుర దశలో 20 కిలోలు చొప్పున వేసుకోవాలి.

జింక్: జింకును దమ్ములో ఎకరాకు 40 కిలోలు చొప్పున వేసుకోవాలి. జింక్ లోపంను పంటచేనులో గుర్తిస్తే వందలీటర్ల నీటిలో 10 గ్రాముల జింక్‌సల్ఫేట్ పౌడర్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

- నీటి ఎద్దడివున్న పంట ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతిలోవరిసాగు ఉత్తమం.

వెదలో కలుపు నివారణ చర్య లు చేపట్టాలి. అనంతరం నీటి నిల్వలను బట్టి యూరి యా, భాస్వరం, పొటాష్ ఎరువులను వ్యవసాయ సిబ్బంది సిఫార్సు మేరకు వినియోగించుకోవాలి.



దుకాణంలో నిల్వ ఉన్న ఎరువులు

విచక్షణ రహితంగా వినియోగించొద్దు



రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించడం వల్ల సాగు ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూమి నిస్సారం అవుతుంది. భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాలకు అనుగుణంగా వ్యవసాయశాఖ సిబ్బంది సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల సాగు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఆర్.విజయభారతి, వ్యవసాయాధికారి, గరుగుబిల్లి

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు, యువత

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన కాంపిటేటీవ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. 'చదవటం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ.. టెట్, డీఎస్సీతో పాటు గ్రూప్స్ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ కొలువులు సాధించిన వారు వారి వద్ద ఉన్న పోటీ పరీక్షలకు సంబంధిన స్టడీ మెటీరియల్ వృథా చేయకుండా గ్రంథాలయానికి అందిస్తే నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



బాదాపు సింధు

భామిని: మండలంలోని బత్తిలి జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని బాదాపు సింధు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం రాడ వెంకటరమణ ఆదివారం తెలిపారు. విద్యార్థిని పదో తరగతి ఒడియా మీడియంలో పూర్తిచేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. విద్యార్థినిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, ఒడియా టీచర్ల సంఘం కార్యదర్శి ఎస్.రాజకుమార్, తదితరులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మ యాజీ, అర్చకులు సత్తె నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదం మాటున జీవన పోరాటం



నీటి అడుగున ఉన్న ఐరన్ స్క్రాప్‌ను వెలికితీస్తున్న యువకులు

పాలకొండ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న బడుగులు తమ జీవన పోరాటంలో భాగంగా శ్రమిస్తున్నారు. పారుతున్న గెడ్డలో ఊపిరి బిగపట్టి నీటి అడుగున చేరిన ఇనుప, లోహపు వ్యర్థాలను ఒడుపుగా సేకరిస్తూ చూపర్లను ఆకట్టుకున్నారు. ఇటీవల మండలంలోని వీపీ రాజుపేట కూడలి వద్ద వీరఘట్టం రహదారిలో ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలతో వస్తున్న లారీ అదుపుతప్పి వంతెనను ఢీకొని గెడ్డలోకి దూసుకెళ్లింది. అధికారులు లారీని బయటకు తీయించి యజమానికి అప్పగించారు. ఈ ఘటనతో లారీలో ఉన్న స్క్రాప్ గెడ్డలో పడిపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ఉధృతికి కొట్టుకుపోగా ఇనుప, లోహపు వ్యర్థాలు నీటి అడుగు భాగంలో ఉండిపోయాయి. వాటిని గుర్తించిన పలువురు పారుతున్న గెడ్డలో దిగి వారిటిని సేకరించే పనిలో నిమగ్నయ్యారు. ఊపిరి బిగపట్టి తలకిందులుగా నీటి అడుగు భాగానికి ఈదుతూ ఆ వ్యర్థాలను కొంచంకొంచంగా పైకి తీసుకొచ్చారు. వాటని అమ్ముకుంటే డబ్బులు వస్తాయని భావించి ఇలా ప్రాణాలను పణంగా పెట్టి స్క్రాప్‌ను సేకరించడంలో నిమగ్నమయ్యారు.

ముమ్మరంగా వరి ఉబాలు

- 15 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు
- 2500 ఎకరాల్లో వెద సాగు



లక్ష్మీపురంలో వరినాట్లు వేస్తున్న మహిళా రైతులు

సీతానగరం:

రెండు రోజుల పాటు కురిసిన వర్షాల కారణంగా వరివెదల మడులలో కలుపుతీయడంతో పాటు వరినాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న మడులలో దమ్ములు చేసి ఉబాలు చేయడానికి రైతులు ఉపక్రమించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని 17,500 ఎకరాల్లోవరి సాగుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో 15 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి ఉబాలకు రైతులు నిర్ణయించి వరి నారు తయారుచేశారు. వరినారు ఏపుగా పెరగడం వల్ల దమ్ము పనులు పూర్తి చేసుకుని వరినాట్లు (ఉబాలు) వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే మండలంలో 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మట్టి నమూనాలు చేసిన వర్షాధారంపై ఆధారపడిన 2,500 ఎకరాల విస్తీర్ణంలో వరి వెదలు వేశారు. పెదంకలాం, సుమిత్రాపురం, కృష్ణారాయపురం, వెంకటాపురం, నిడగల్లు గాదెలవలస, జానుమల్లువలస, పీబీ పేట గ్రామాల్లో వరివెద భూముల్లో వరి మొక్కలు ఏపుగా పెరగడంవల్ల రైతులు కలుపు నివారణకు పనులు ఆరంభించారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మడులలో నీరు చేరడంతో పాటు నీటి వనరులున్న, వరినారు వేయడానికి అనుకూలంగా వాతావరణం ఉన్నందున ఉబాలు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఉబాలు చేసిన మడులలోను, వరివెదలు వేసిన పొలాల్లో ఎరువులు వేయాల్సిన సమయం వచ్చింది. అలాగే చెరకు పంట తోటలలో వేయడానికి ఎరువుల అవసరం ఉంది. ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ఎరువులు సమకూర్చవలసిన సమయం ఆసన్నమైనప్పటికీ అరకొరగా ఎరువులు నిల్వలున్నా యని రైతులు ఆరోపిస్తున్నారు. ఉబాలు చేయడం, వరివెదల మొక్కలు పెరుగుతున్న కారణంగా రైతులు ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు.



తాడు ఆధారంగా వరి నాట్లు వేస్తున్న రైతు కూలీలు

రైతులకు ఎరువులు అందిస్తాం



వర్షాలు అనుకూలంగా కురిసిన మేరకు మండలంలో వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధమై దమ్ము పనులు ఆరంభించారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేస్తున్న రైతులకు పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులు సమకూర్చడానికి సిద్ధం చేస్తున్నాం.

– ఎస్.అవినాష్, ఏఓ సీతానగరం

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మండలంలో 2024–25 ఖరీఫ్ సీజన్‌ల్లో రైతులు పండించే వరిపంటకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. ఎరువుల విక్రయాలపై అధికారులు దృష్టి సారించాలి. వరిపంటలో వచ్చే తెగులు, ఇత వ్యాధులను ఎప్పటికప్పుడు పరిశీలించి రైతాంగానికి పలు సూచనలు సలహాలు ఇవ్వాలి. పంటల బీమా పథకం అమలు చేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

–ఆర్.ఈశ్వరరావు, రైతు సంఘం డివిజన్ నాయకుడు

నేడు మారు రథయాత్ర



కల్కి, జగన్మోహిని అవతారంలో జగన్నాథస్వామి

వీరఘట్టం: ఈ నెల 7న ప్రారంభమైన జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు చివరిదశకు చేరుకున్నాయి. సోమవారం నిర్వహించే మారు రథయాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి. మారు రథయాత్రను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటలకు గుండిచా మందిరంలో ఉన్న స్వామివారిని రథంపై ప్రధాన మందిరానికి తీసుకురానున్నట్లు అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు మారు రథయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కల్కి, జగన్మోహిని అవతారంలో జగన్నాథుడు

పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి ఆదివారం కల్కి, జగన్మోహినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి మారు రథయాత్ర ప్రారంభమవుతుంది. ఈ మేరకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

పత్తిచేనులో కలుపుతీత



బిల్లుమడ వద్ద పత్తిచేనులో కలుపు తీస్తున్న కూలీలు

భామిని: మండలంలో ప్రధాన మెట్టు పంటగా సాగు చేస్తున్న పత్తి చేనులో గొప్పులు, కలుపు తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అడపాతడపా కురుస్తున్న వానలకు పత్తి విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా మారాయి. ఈ దశలో కలుపు నివారణపై రైతులు దృష్టి పెట్టారు. ఒకవైపు ఖరీఫ్ వరి దమ్ములు, ఉభాలు.. మరోవైపు పత్తిసాగులో గొప్పులు, కలుపు తీత పనుల నేపథ్యంలో రైతు కూలీలకు డిమాండ్ పెరిగింది.

లోపించిన పారిశుధ్యం



నగరపంచాయతీ కార్యాలయం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ రూరల్: పట్టణంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ప్రజల ఆరోగ్య భద్రతకు అండగా ఉండాల్సిన అధికారి కార్యాలయం వద్దనే చెత్త పేరుకుపోయింది. సాక్షాత్తు నగరపంచాయతీ కార్యాలయం వద్దనే పరిస్థితి ఇలా ఉంటే ఇక శివారు వీధులు, ప్రధాన కూడళ్ల వద్ద పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వర్షాకాలంలో మురుగు నీరు వీధుల్లో నిలిచిపోయి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ఇక్కడి యంత్రాంగానికి పట్టనట్లు ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర పంచాయతీ కార్యాలయం ఎదుగా ఉన్న శాఖాగ్రంథాలయానికి వచ్చే పాఠకులు, ప్రధాన కాయగూరల మార్కెట్‌కు వచ్చే ప్రజలు ఇక్కడి వ్యర్థాలను చూసి ముక్కు మూసుకుంటున్నారు.

పశుగ్రాసంతో పాలదిగుబడి



పశుగ్రాస క్షేత్రాలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి మన్మథరావు

గరుగుబిల్లి: పాడిపశువులు అధిక దిగుబడి ఇచ్చేందుకు మేలుజాతి పశుగ్రాసం ఎంతో అవసరమని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని చిలకాంలోని పశుగ్రాస క్షేత్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషక విలువలున్న పశుగ్రాసాన్ని పాడిపశువులకు అందించడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు మంచి పాల దిగుబడి ఇస్తాయన్నారు. పశుగ్రాసం సాగుకు పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.ఎస్.సురేష్‌కుమార్, సిబ్బంది శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.


రహదారిపై గొయ్యి పూడ్చివేత



రోడ్డుపై ఉన్న గొయ్యిని పూడుస్తున్న యువత

కొమరాడ: కొమరాడ సమీపంలో అంతరరాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి కారణంగా వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న పలువురు నాయకులు, యువత ఆదివారం నిధులు సేకరించి ఆ గొయ్యిని పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. గ్రామస్తులు, స్థానిక యువత శ్రమదానం చేసి గొయ్యిని పూడ్చారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గోతులను శాశ్వతంగా పూడ్చివేయాలని వారంతా కోరుతున్నారు.

విస్తారంగా వర్షాలు



గరుగుబిల్లిలో కురుస్తున్న వర్షం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఈ వర్షాలు ఎంతో అనుకూలంగా ఉంటాయని రైతులు అంటున్నారు. వర్షాలతో పాటు తోటపల్లి ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయడంతో ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

- **జియ్యమ్మవలస:** మండలంలో గత మూడురోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పొలాల్లో నీరు చేరడంతో వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలోని వెంకటరాజపురం, గవరమ్మపేట, చింతలబెలగాం, రామినాయుడువలస, పెదమేరంగి తదితర గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది.



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో కురుస్తున్న వర్షం

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సమావేశంలో పాల్గొని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. అధికారులుపూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.